# కన్నెర్ర చేసి.. నిరసన ర్యాలీ చేపట్టి..

• నకిలీ మద్యంపై వైఎస్సార్‌సీపీ రణభేరి

**వెంకటాచలం:** నకిలీ మద్యంతో ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్న టీడీపీ నేతల వైఖరి, కూటమి ప్రభుత్వ తీరును నిరసిస్తూ వైఎస్సార్‌సీపీ రణభేరి మోగించింది. ఆ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పిలుపు మేరకు, మాజీ మంత్రి, పార్టీ జిల్లా అధ్యక్షుడు కాకాణి గోవర్ధన్‌రెడ్డి ఆదేశాల మేరకు సర్వేపల్లి నియోజకవర్గ కేంద్రమైన వెంకటాచలంలో సోమవారం నేతలు నిరసన కార్యక్రమం చేపట్టారు. సర్వేపల్లి క్రాస్‌రోడ్డు వద్ద నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. ప్రజల ప్రాణాలు హరిస్తున్న నకిలీ మద్యాన్ని అరికట్టాలంటూ నినాదాలు చేశారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రంలోని అనేక ప్రాంతాల్లో నకిలీ మద్యం తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని విమర్శించారు. టీడీపీ నాయకులే నకిలీ మద్యం తయారీలో భాగాస్వాములుగా ఉన్నారని ఆరోపించారు. ప్రభుత్వాదాయానికి గండిపడుతున్నా చర్యలు చేపట్టకపోవడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. నీరు దొరకని గ్రామాలు అక్కడక్కడా ఉన్నాయేమో గానీ ప్రతి పల్లెలో విచ్చలవిడిగా బెల్టు షాపుల్లో మద్యం దొరుకుతోందన్నారు. నకిలీ మద్యం తయారీని కుటీర పరిశ్రమగా మార్చి ప్రజల ప్రాణాలకు ముప్పు కలిగిస్తున్నా కూటమి పెద్దలు స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వెంటనే బెల్టు షాపులు లేకుండా చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర నాయకులు చిల్లకూరు సుధీర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మందల వెంకటశేషయ్య, వెంకటాచలం, మనుబోలు ఎంపీపీలు మందా కవిత, వజ్రమ్మ, జిల్లా నాయకులు బచ్చుల సురేష్‌కుమార్‌రెడ్డి, ముత్తుకూరు మండల కన్వీనర్ మెట్టా విష్ణువర్ధన్‌రెడ్డి, దాసరి భాస్కర్‌గౌడ్, ఉప్పల శంకరయ్యగౌడ్ తదితరులు పాల్గొన్నారు.


వెంకటాచలం: డీటీకి వినతిపత్రం అందజేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు


కోవూరు: ఎక్సైజ్ సీఐకి వినతిపత్రం ఇస్తున్న మహిళలు

**దెబ్బతింటున్న సామాజిక జీవనం**

**కోవూరు:** నకిలీ మద్యం, అక్రమ బెల్ట్ షాపుల వల్ల గ్రామాల్లో సామాజిక జీవనం దెబ్బతింటోందని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం నాయకులు అన్నారు. ఈ మేరకు స్థానిక ఎక్సైజ్ పోలీస్‌స్టేషన్ వద్ద మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో మహిళలు సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. నకిలీ మద్యం తయారీదారులపై కఠిన చర్యలు తీసుకోవాలంటూ నినాదాలు చేశారు. అనంతరం ఎక్సైజ్ సీఐ కిశోర్‌కు మహిళలు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వీధివీధిన వెలసిన బెల్టు షాపుల వల్ల కుటుంబాలు దెబ్బతింటున్నాయన్నారు. పిల్లల చదువులు, కుటుంబ పోషణ దెబ్బతింటోందన్నారు. ఇలాంటి పరిస్థితులకు చెక్ పెట్టేందుకు గ్రామాల్లో బెల్ట్ షాపులు మూసివేయాలన్నారు. ప్రజల ఆరోగ్యం, కుటుంబాల శాంతిని కాపాడడం ప్రభుత్వ ప్రధాన కర్తవ్యమన్నారు. మహిళల భద్రత కోసం నకిలీ మద్యం వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీలత, వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం ప్రతినిధులు ఏడెం లక్ష్మీకుమారి,, ఉమా, జ్యోతి, కల్యాణి, రాజేశ్వరి, పర్వీన్, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## అనుమానాలు రేపుతున్న పవన్ మౌనం

**కోవూరు:** రాష్ట్రంలో నకిలీ మద్యం ఏరులై పారుతుంటే ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మౌనంగా ఉండడం ప్రజల్లో పలు అనుమానాలు రేపుతున్నాయని మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర పీఏసీ సభ్యుడు నల్లపరెడ్డి ప్రసన్నకుమార్‌రెడ్డి అన్నారు. మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణపై ఆయన కోవూరులో కోటి సంతకాల సేకరణ పోస్టర్‌ను సోమవారం ఆవిష్కరించారు. అనంతరం నకిలీ మద్యంపై మాట్లాడారు. ఉప ముఖ్యమంత్రి పదవితో ఒక బంగ్లా.. జీతం తీసుకొంటే సరిపోదని హితవు పలికారు. చంద్రబాబు సొంత జిల్లాలో తెలుగుదేశం పార్టీ తరపున పోటీ చేసి ఓడిపోయిన వ్యక్తి ఈ నకిలీ మద్యాన్ని సృష్టించి ఏరులై పారిస్తున్నాడన్నారు. నేరస్తులను కాపాడేందుకు చంద్రబాబు తన జేబులో ఉన్న సంస్థ సిట్‌ను విచారణకు ఆదేశించారన్నారు. నీకు దమ్ము, ధైర్యం ఉంటే సీబీఐ విచారణ వేయించాలని డిమాండ్ చేశారు. 15 నెలల కూటమి పాలనలో రాష్ట్రంలో గందరగోళ పరిస్థితిలు ఏర్పడ్డాయని, ఇప్పటికైనా పవన్ కల్యాణ్ స్పందించాలని, ఉపముఖ్యమంత్రి పదవికి తగిన న్యాయం చేయాలని హితవు పలికారు. నకిలీ మద్యం తయారీ అతి పెద్ద స్కామ్ అని, దీని ద్వారా వచ్చే మొత్తం చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేశ్‌కు చేరుతోందని, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌కు ప్యాకేజీ వెళ్తోందన్నారు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో 43 వేల బెల్టుషాపులను ఒక్క సంతకంతో వైఎస్ జగన్ తొలగించేలా చర్యలు తీసుకుంటే.. చంద్రబాబు వచ్చాక మళ్లీ 70 వేల బెల్టు షాపులు పుట్టుకొచ్చాయన్నారు. ప్రజాప్రతినిధుల కనుసన్నల్లోనే విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు జరుగుతున్నాయన్నారు.

**జిల్లాలో పెరిగిన నేరాలు**

2025లో నెల్లూరు జిల్లాలో 20 నుంచి 25 హత్యలు జరిగాయని, నేరాల తీవ్రత పెరిగిపోయినా పోలీస్ శాఖ దీనిపై ఏమి చేస్తోందని ప్రసన్న నిలదీశారు. జిల్లాలో ఇద్దరు సీనియర్ మంత్రులుంటే ఎందుకు మాట్లాడడం లేదన్నారు. సరైన సమయంలో చంద్రబాబుకు.. పవన్ కల్యాణ్‌కు.. బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. మోదీ ఇప్పటికే రాష్ట్రంలో సర్వే చేయించారని, ఇందులో కూటమికి సంబంధించిన దాదాపు 95 మంది ఎమ్మెల్యేల మీద వ్యతిరేకత వ్యక్తమవుతోందనే రిపోర్ట్స్ వచ్చిందన్నారు. నకిలీ మద్యం కేసులో కూటమి ప్రభుత్వానికి సంబంధించిన నాయకులే బయటపడ్డారని, రూ.వేల కోట్ల నగదు దోచేస్తున్నారన్నారు. వీటిని అరికట్టేందుకు మేము పోరాటాలు చేస్తూనే ఉంటామని స్పష్టం చేశారు. ఈనెల 28న కోవూరు నియోజకవర్గంలో జరిగే ర్యాలీలో నేను పాల్గొంటానని, మాజీ మంత్రి అనిల్‌కుమార్ యాదవ్‌ను కూడా ఆహ్వానించానని తెలిపారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొని జయప్రదం చేయాల్సిందిగా కోరారు.


పోస్టర్లను ప్రదర్శిస్తున్న ప్రసన్నకుమార్‌రెడ్డి, నేతలు

## క్లుప్తంగా

### పొదలకూరులో వర్షం



**పొదలకూరు:** పొదలకూరులో సోమవారం వర్షం కురిసింది. కాసేపు ఎండ కాసింది. కొంతసేపు వాన పడింది. ఉక్కపోతతో అల్లాడుతున్న పట్టణ వాసులు కొంత ఉపశమనం పొందారు. పిడుగుల శబ్దంతో వర్షం కురవడంతో జనాలు బెంబేలెత్తారు. రెండురోజుల క్రితం పిడుగులతో కూడిన వర్షం కురిసి పట్టణంలో చాలా ప్రాంతాల్లో గృహాల్లోని విద్యుత్ సామగ్రి కాలిపోయింది.

### అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



**ముత్తుకూరు(పొదలకూరు):** విత్తనాలు, ఎరువులను అధిక ధరలకు రైతులకు అమ్మితే చర్యలు తీసుకుంటామని నెల్లూరు వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీఏ శ్రీదేవి హెచ్చరించారు. మండలంలో పురుగు మందులు, విత్తనాలు విక్రయిస్తున్న దుకాణాలు, సొసైటీ గోదాములను వ్యవసాయ శాఖ అధికారులు సోమవారం తనిఖీ చేశారు. ధరల పట్టికను దుకాణాల వెలుపల ఉంచాల్సిందిగా సూచించారు. కార్యక్రమంలో ఏఓ జ్యోత్స్న, ఏఈఓ దేవరాజ్ పాల్గొన్నారు.

### సమస్యల పరిష్కారానికి కృషి : కమిషనర్


ప్రజల నుంచి అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్ నందన్

**నెల్లూరు(బారకాసు):** స్థానిక సమస్యలపై ప్రజలు ఇచ్చే అర్జీలను నిర్దేశిత గడువులోగా శాశ్వత పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ వైఓ నందన్ కోరారు. ఎన్ఎంసీ కార్యాలయ ఆవరణలోని కమాండ్ కంట్రోల్ సెంటర్ సమావేశ మందిరంలో పీజీఆర్ఎస్‌ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ ప్రజలు ఇస్తున్న అర్జీలకు సమగ్ర పరిష్కారం చూపాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో మురుగునీరు రోడ్లపై చేరకుండా కాలువల నిర్మాణం, మరమ్మతు పనులను అన్ని డివిజన్లలో చేపడుతున్నామని తెలిపారు. ఖాళీ స్థలాలను వాటి యజమానులు పరిశుభ్రంగా ఉంచుకునేలా సంబంధిత వార్డు సచివాలయ కార్యదర్శులు చర్యలు తీసుకోవాలన్నారు. కాలువలను ఆక్రమించి ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దన్నారు. కాగా ప్రజల నుంచి 68 అర్జీలు అందాయని, వాటిలో అకౌంట్ సెక్షన్-4, ఆప్కాస్-6, ఇంజినీరింగ్-15, హౌసింగ్ సెక్షన్-24, పబ్లిక్ హెల్త్-4, రెవెన్యూ-4, టౌన్ ప్లానింగ్-7, పెన్షన్-4 చొప్పున అందాయన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, ఇంజినీరింగ్ విభాగం ఎస్ఈ రామ్మోహన్‌రావు, సిటీ ప్లానర్ హిమబిందు, ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ కనకాద్రి, మేనేజర్ రాజేశ్వరి, అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### ఏపీకి వచ్చే అర్హత మోదీకి లేదు



మాట్లాడుతున్న మున్నా, మస్తాన్ షరీఫ్

**నెల్లూరు(వీఆర్సీసెంటర్):** ఇచ్చిన హామీలను అమలు చేయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ రాష్ట్రానికి వచ్చే అర్హత లేదని ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి మున్నా, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి మస్తాన్ షరీఫ్ అన్నారు. సంతపేటలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తాను తిరిగి అధికారంలోకి వస్తే సంవత్సరానికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తానని చెప్పి యువతను మోదీ మోసం చేశారన్నారు. ఈనెల 16వ తేదీ కర్నూలు జిల్లాకు మోదీ ఏ ముఖం పెట్టుకుని వస్తున్నారన్నారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వని, కడపలో ఉక్కు ఫ్యాక్టరీ ఏర్పాటు చేయని, విశాఖ ఉక్కును ప్రైవేటీకరించే పనులు చేస్తున్న మోదీ.. ఇక్కడికి రావల్సిన అవసరం లేదన్నారు. కేంద్ర పథకాలను రాష్ట్రానికి తీసుకురావడంతో విఫలమైన చంద్రబాబు సర్కార్ సోషల్ మీడియా, పచ్చ మీడియాలో డప్పులు కొట్టుకుంటున్నారని ఎద్దేవా చేశారు. అధికారంలోకి వస్తే రాష్ట్రానికి ప్రత్యేక హోదా తెస్తానని చెప్పిన పవన్ కల్యాణ్.. ఇప్పుడు ఏమి చేస్తున్నాడో చెప్పాలని నిలదీశారు. ఈనెల 15న వామపక్షాల ఆధ్వర్యంలో గో బ్యాక్ మోదీ అనే నినాదంతో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నామన్నారు. ఈ సమావేశంలో గౌస్‌బాషా, మీరామెహిద్దీన్, నాగూర్, చైతన్య, రమణ తదితరులు పాల్గొన్నారు.

### దేవాలయ భూములకు కౌలు వేలం



**తోటపల్లిగూడూరు:** మండలంలోని మేజర్ పంచాయతీ కోడూరులో ఉన్న వివిధ ఆలయాలకు చెందిన మాగాణి భూముల కౌలు వేలం పాట సోమవారం స్థానిక శివాలయంలో దేవదాయ శాఖ కార్యనిర్వాహణాధికారి కవిత ఆధ్వర్యంలో జరిగింది. మూడేళ్లకు వేలం నిర్వహించారు. గతంతో పోల్చితే ఈ ఏడాది గోపాలకృష్ణస్వామి ఆలయ భూములకు సంబంధించి రూ.3 వేలు, కోటేశ్వర స్వామి ఆలయ భూములకు రూ.9,600, చెన్నకేశవుల స్వామి ఆలయ భూములకు రూ.15,500 అదనంగా ఆదాయం లభించింది. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త పెమ్మారెడ్డి బుజ్జిరెడ్డి, అర్చకులు మణికంఠ స్వామి, పరిరక్షణ సమితి సభ్యులు బత్తల వెంకటరమణయ్య తదితరులు పాల్గొన్నారు.

### చెత్త తొలగింపు


చెత్తను తొలగిస్తున్న సిబ్బంది

సాక్షి ఎఫెక్ట్..

**మనుబోలు:** మండలంలోని మనుబోలు బస్టాండ్ సెంటర్‌లో రావి చెట్టు వద్ద రోడ్డుపక్కన పోగుపడిన చెత్తను పంచాయతీ సిబ్బంది తొలగించారు. 'పేరుకుపోతున్న చెత్త' అనే శీర్షికన సోమవారం సాక్షిలో వెలువడిన కథనానికి పంచాయతీ కార్యదర్శి గరుడయ్య స్పందించారు. సిబ్బందిని పంపి చెత్తను తొలగించారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

# ఎరువుల దుకాణాల తనిఖీ

**కొడవలూరు:** మండలంలోని విత్తనాలు, ఎరువుల దుకాణాలను జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ మారుతీదేవి సోమవారం తనిఖీ చేశారు. యల్లాయపాళెం రోడ్డులోని విత్తన తయారీ కేంద్రాన్ని తనిఖీ చేశారు. విత్తనాల నాణ్యతను పరిశీలించారు. నిల్వలకు సంబంధించిన రికార్డులు సరిచూశారు. నార్తురాజుపాళెంలోని ఎరువుల దుకాణాలను తనిఖీ చేశారు. కొనుగోలుదారులకు బిల్లులు తప్పనిసరిగా ఇవ్వాలని సూచించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యూరియాకు సంబంధించి కార్డుల పంపిణీ జరుగుతోందన్నారు. రైతులు సంబంధిత వీఏఏలను సంప్రదించి కార్డులు పొందాలన్నారు. ఎకరాకు మూడు బస్తాల వంతున మూడు విడతలుగా రైతులకు యూరియాను ఇస్తామని తెలిపారు. ఆమె వెంట ఏఓ ఎస్.విజయలక్ష్మి ఉన్నారు.


యల్లాయపాళెం రోడ్డులోని విత్తన తయారీ కేంద్రంలో రికార్డులు పరిశీలిస్తున్న ఏడీఏ

# ఏకలవ్య పాఠశాలలో పారిశుద్ధ్య పనులు

**కొడవలూరు:** మండలంలోని చంద్రశేఖరపురం ఈఎంఆర్ఎస్ (ఏకలవ్య మోడల్ స్కూల్)లో కొడవలూరు పీహెచ్‌సీ ఆధ్వర్యంలో సోమవారం పారిశుద్ధ్య చర్యలు చేపట్టారు. దోమల నివారణ మందులను స్ప్రే చేశారు. ట్యాంక్‌లోని నీటిని పరీక్షించారు. అనంతరం విద్యార్థులకు సీజనల్ వ్యాధులపై అవగాహన కల్పించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై హెచ్ఏ ఓ.సుధాకర్ తెలియజేశారు. కార్యక్రమంలో ఏఎన్ఎంలు టి.రాధమ్మ, ప్రశాంతి, ఆశా కార్యకర్త శీనమ్మ తదితరులు పాల్గొన్నారు.



# ప్రకృతి ఉత్పత్తులు ఆరోగ్యకరం

**కొడవలూరు:** ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల వినియోగం ఆరోగ్యకరమని ప్రకృతి వ్యవసాయం డీపీఎం మునిరత్నం తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులను ప్రదర్శించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎలాంటి రసాయన ఎరువులను వినియోగించకుండా కేవలం ప్రకృతి సిద్ధమైన ఎరువులను వాడి పండించిన పండ్లు, కూరగాయలు, ఆకుకూరలు ఎంతో ఆరోగ్యకరమన్నారు. కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ ఎండీ మల్లికార్జున, మాస్టర్ ట్రైనర్ భవజన్, తహసీల్దార్ కె.స్ఫూర్తి రెడ్డి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది రామ్‌ప్రసాద్, దీపిక తదితరులు పాల్గొన్నారు.



# గ్రామాల అభివృద్ధిలో సహకార సంఘాలు కీలకం

**ఇందుకూరుపేట:** గ్రామాల అభివృద్ధిలో సహకార సంఘాలు కీలకపాత్ర పోషిస్తున్నాయని ఇందుకూరుపేట కో ఆపరేటివ్ సొసైటీ చైర్మన్ గండవరపు అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. ఈ మేరకు ఇందుకూరుపేటలో సొసైటీ కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. రైతుల సంక్షేమం కోసం సభ్యులంతా కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నెల్లూరు కోఆపరేటివ్ ఆఫీసర్ వెంకటేష్‌రెడ్డి, సబ్ డివిజన్ కో ఆపరేటివ్ ఆఫీసర్ మల్లికార్జున్ పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అమర్‌నాథ్‌రెడ్డి

# నేటి నుంచి అండర్-19 స్కూల్ గేమ్స్

**నెల్లూరు(టౌన్):** అండర్-19 స్కూల్ గేమ్స్‌కు సంబంధించి బాలబాలికలకు మంగళవారం నుంచి ఆటల పోటీలు నిర్వహించనున్నట్లు డీవీఈఓ కృష్టారెడ్డి, ఆర్ఐఓ వరప్రసాదరావు, అండర్-19 గేమ్స్ ఆర్గనైజింగ్ సెక్రటరీ పాటూరు వేణుగోపాల్ రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 14న స్థానిక చిల్డ్రన్స్ పార్కు ఎదురుగా ఉన్న శ్రీఆనంద్ చెస్‌వింగ్స్‌లో చదరంగ పోటీలు, దర్గామిట్టలోని నెల్లూరు క్లబ్‌లో క్యారమ్స్, 15న ఏసీ సుబ్బారెడ్డి స్టేడియంలో బాస్కెట్ బాల్, 16న కోడూరుపాడులోని జెడ్పీ హైస్కూల్‌లో బాల్ బ్యాడ్మింటన్ పోటీలు జరుగుతాయన్నారు. ఉదయం 10 గంటలకు పోటీలు ప్రారంభమవుతాయన్నారు.

### వేగూరులో రీ సర్వేపై గ్రామసభ నేడు

**కోవూరు:** మండల పరిధిలోని వేగూరు గ్రామంలో జరిగిన రీ సర్వేకు సంబంధించి మంగళవారం గ్రామసభ ఉంటుందని తహసీల్దార్ సుబ్బయ్య సోమవారం తెలిపారు. ఎవరికైనా అభ్యంతరాలు ఉంటే తెలుపుకోవచ్చని వివరించారు.

### ఎక్సైజ్ యాక్షన్ ప్లాన్‌పై సమావేశం

**కోవూరు:** మండల కేంద్రంలోని ఎక్సైజ్ కార్యాలయంలో అక్టోబర్ నెలకు సంబంధించిన యాక్షన్‌పై సీఐ కిశోర్ సోమవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు చేశారు.

### బీజేపీ నేతల సమావేశం

**బుచ్చిరెడ్డిపాళెం రూరల్:** పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ఆత్మ నిర్భర్‌లో భాగంగా బీజేపీ నేతలు సోమవారం సమావేశం నిర్వహించారు. బీజేపీ పట్టణాధ్యక్షుడు రామిశెట్టి కల్యాణ్‌కుమార్ పాల్గొని, మాట్లాడుతూ ఆత్మ నిర్భర్ కార్యక్రమంలో భాగంగా స్వదేశీ వస్తువులను ఉపయోగించాలన్నారు. అనంతరం ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో పలువురు జిల్లా, మండల నాయకులు పాల్గొన్నారు.

• **ఇందుకూరుపేట:** మండలంలోని కొత్తూరు గ్రామంలో ఆత్మనిర్భర్ మండల సమావేశం సోమవారం జరిగింది. పార్టీ మండలాధ్యక్షుడు కైలాసం శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో బుచ్చిరెడ్డిపాళెం అర్బన్ ఇన్‌చార్జి మారుబోయిన శ్రీనివాసులు, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు కరణం సుభాషిని, జిల్లా ఉపాధ్యక్షుడు కాసా శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి ఆలూరు నాగవేణి తదితరులు పాల్గొన్నారు.

### మినీ లారీ బోల్తా

**దగదర్తి:** మండల పరిధిలోని అల్లూరు రోడ్డు వద్ద రైల్వే వంతెనపై జాతీయ రహదారి రెండులేన్లు మాత్రమే ఉండడం.. సూచిక బోర్డులు కనిపించే విధంగా లేకపోవడం వల్ల తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. సోమవారం కావలి నుంచి నెల్లూరు వైపు వెళ్తున్న మినీలారీ రైల్వే వంతెన సమీపంలో మార్జిన్‌లో ఏర్పాటు చేసిన రాళ్లను ఢీకొని అదుపుతప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్‌కు స్వల్ప గాయాలయ్యాయి. కొద్దిసేపటి తర్వాత మరో లారీ మార్జిన్‌లో ఏర్పాటు చేసిన రాళ్లను ఢీకొని డివైడర్ పైకి దూసుకెళ్లింది. అంతలోనే మరో కంటైనర్ డ్రైవర్ రోడ్డుపై బోల్తాపడిన లారీని దగ్గరికి వచ్చిన తర్వాత గమనించి బ్రేక్ వేయడంతో వాహనం అదుపుతప్పి పక్కనే ఉన్న పొలాల్లోకి దూసుకెళ్లింది. సమాచారం అందుకున్న దగదర్తి పోలీసులు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టారు.

**స్పందించాలి**

అత్యంత ప్రమాదభరితంగా ఉన్న ఈ ప్రాంతంలో హైవే అధికారులు ఎటువంటి సూచిక బోర్డులు ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఇప్పటికైనా హైవే అధికారులు, పోలీసులు స్పందించి ఈ ప్రాంతంలో సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని వాహనచోదకులు కోరుతున్నారు.

# కౌలు రైతుల సమస్యలను పరిష్కరించాలి

**కోవూరు:** రాష్ట్ర ప్రభుత్వం కౌలు రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని ఏపీ కౌలు రైతు సంఘం నాయకుడు తుల్లూరు గోపాల్ అన్నారు. ఈ మేరకు కోవూరు తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆయన సోమవారం మాట్లాడారు. ప్రభుత్వం నూతన కౌలు చట్టం తెస్తామని ఎన్నికల ముందు హామీ ఇచ్చిందని, ఇప్పటికీ దానిని అమలు చేయలేదన్నారు. భూ యజమాని సంతకం తప్పనిసరి అనే నిబంధన వల్ల కౌలు రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. కాబట్టి పాత చట్టాన్ని రద్దు చేసి భూ యజమాని అనుమతితో సంబంధం లేకుండా గ్రామసభల ద్వారా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలన్నారు. తద్వారా వారికి అన్ని పథకాలు వర్తిస్తాయన్నారు. అలాగే కులాలతో సంబంధం లేకుండా ప్రతి కౌలు రైతుకు పెట్టుబడి సాయం కింద ఒకే విడతగా రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో గండవరపు శేషయ్య, బుజ్జియ్య, ఖాదర్‌మస్తాన్, మోహన్‌రావు, చిట్టిబాబు, రామచంద్రయ్య పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కౌలు రైతు సంఘ నాయకులు

# 'మూడు యూరియా బస్తాలే ఇస్తాం'

**మనుబోలు:** ఎకరాకు గరిష్ఠంగా మూడు యూరియా బస్తాలు మాత్రమే రైతులకు ఇస్తారని వ్యవసాయ శాఖ ఏడీఏ శివనాయక్ తెలిపారు. స్థానిక కార్యాలయంలో సోమవారం ఆయన ఫర్టిలైజర్ డీలర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏడీఏ మాట్లాడుతూ యూరియా కొనుగోలు చేయాలంటే వ్యవసాయ శాఖ జారీచేసే కార్డులు తీసుకుని ఎరువుల దుకాణాలకు వెళ్లాలని తెలిపారు. కౌలు రైతులకు కూడా కార్డులిస్తామన్నారు. ఎకరాకు మూడు బస్తాల యూరియా సరిపోతుందన్నారు. అదనంగా కావాలనుకుంటే నానో యూరియాను వాడుకోవచ్చన్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే ఎరువులు విక్రయించాలని, అధిక ధరలకు అమ్మితే చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో మండల వ్యవసాయాధికారి వెంకటకృష్ణ, వీఏఓలు పాల్గొన్నారు.


డీలర్లతో మాట్లాడుతున్న ఏడీఏ

# నిమ్మ ధరలు పతనం

**పొదలకూరు:** నిమ్మ కాయల ఎగుమతికి దీపావళి షాక్ తగుతున్నట్టు వ్యాపారులు వెల్లడిస్తున్నారు. మోస్తరుగా ఉన్న ధరలు సోమవారం తగ్గుముఖం పట్టాయి. ప్రస్తుతం మార్కెట్లో ఒక కిలో రూ.20 నుంచి రూ.30 ఉంది. ఢిల్లీ మార్కెట్లో కాయలకు డిమాండ్ తగ్గుతుండటంతో ఇక్కడ ధరలు పతనమవుతున్నట్టు వ్యాపారులు తెలిపారు. దీనికితోడు దిగుబడి అధికంగా ఉండటంతోపాటు దీపావళి షాక్ తగుతున్నట్టు చెప్పుకొస్తున్నారు. ఢిల్లీ మార్కెట్ నుంచి చిరు వ్యాపారులు పెద్ద సంఖ్యలో కాయలను తీసుకుని వెళ్లి గ్రామీణ ప్రాంతాలు, మహానగరంలో మారుమూల్లో విక్రయిస్తుంటారు. అయితే వారు ప్రస్తుతం బాణసంచా వ్యాపారం వైపు వెళుతుండటంతో నిమ్మకాయల అమ్మకాలను బాగా తగ్గించారు. ఢిల్లీ మార్కెట్ వ్యాపారులు కాయలను తగ్గించి పంపాల్సిందిగా సూచిస్తున్నారు. ఫలితంగా మార్కెట్‌కు వస్తున్న కాయలను వ్యాపారులు గ్రేడింగ్ చేసి తప్పనిసరి పరిస్థితుల్లో ధరలు తగ్గించి ఎగుమతులు చేయాల్సి వస్తోంది. చలి కాలం మొదలైతే కాయల ధరలు ఇంకా పతనమవుతాయని అంటున్నారు.


మార్కెట్‌కు వచ్చిన కాయలు

# భూముల ఆక్రమణపై ఫిర్యాదు

**పొదలకూరు:** నావూరుపల్లికి చెందిన నావూరు రెవెన్యూ విలేజ్ 942 సర్వే నంబర్‌లో గ్రామానికి చెందిన కొందరు కొండ పోరంబోకు భూమిని ఆక్రమించి సాగు చేసుకుంటున్నట్టు కొందరు రైతులు సోమవారం తహసీల్దార్ బి.శివకృష్ణయ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తమ గ్రామానికి చెందిన తలచీరు రాఘవేంద్రరావు 10 ఎకరాలు, మాల్యాద్రి ఎకరా, పెంచలయ్య 50 సెంట్లు, కృష్ణయ్య ఎకరా, అమ్మవారిపాళేనికి చెందిన నరేంద్ర రెండు ఎకరాలు ఆక్రమించి నిమ్మ, జామాయిల్, మామిడి పంటలు సాగు చేస్తున్నట్టు పేర్కొన్నారు. భూముల చుట్టూ కంచె ఏర్పాటు చేయడంతో పశువులు కొండ పోరంబోకులో మేత మేసేందుకు దారిలేక ఇబ్బందులు పడుతున్నాయన్నారు. ఆక్రమణపై ఈ ఏడాది జనవరిలో కలెక్టర్‌కు ప్రజా సమస్యల పరిష్కార వేదికలో అర్జీ అందజేశామన్నారు. గ్రామానికి చెందిన చేబ్రోలు ప్రసన్న అనే రైతు తన నీటి అవసరాల నిమిత్తం కొండ పోరంబోకులో బోరు వేసుకుని తోటకు నీటిని పెట్టుకోవడంతోపాటు, ఇతర రైతులకు కూడా నీటిని అందజేస్తున్నాడని చెప్పారు. అయితే విద్యుత్ కనెక్షన్‌ను కట్ చేశారన్నారు. కానీ భూములను ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోకుండా కేవలం నీటి అవసరాల కోసం బోరు వేసిన రైతుపై చర్యలు తీసుకున్నట్టు వాపోయారు. వెంటనే కొండ పోరంబోకు భూములను ఆక్రమణల చెర నుంచి విడిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు.